క్లుప్తంగా

మిర్చి పంటపై గడ్డిమందు పిచికారీ



కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన రైతు ఆశరెల్లి పురుషోత్తం సాగు చేసిన మిర్చి చేనులో దుండగులు నిషేధిత గడ్డిమందు పిచికారీ చేసి దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. బుట్టాయిగూడెంకు చెందిన పురుషోత్తం తన 1.20 ఎకరాల భూమిలో మిర్చి సాగు చేశాడు. రోజు మాదిరిగానే సోమవారం పని చేసి ఇంటికి వచ్చి మరసటి రోజు చేనుకు వెళ్లి చూసే సరికి పంటపై ఇసుకలో గడ్డిమందు కలిపి చల్లినట్లు గుర్తించాడు. తాను పెట్టుబడి సైతం నష్టపోయినట్టు వాపోయాడు. కాగా ప్రభుత్వం గడ్డిమందు విక్రయాన్ని నిషేధించినా మండలంలో విరివిగా విక్రయాలు సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలానికి రెగ్యులర్ ఏఓ లేకపోవడం వల్లే పర్యవేక్షణ కరువైందని తెలుస్తోంది. మిర్చి పంటపై గడ్డిమందు చల్లిన దుండగులపై చర్యలు తీసుకుని పురుషోత్తంకు న్యాయం చేయడంతోపాటు మండలానికి రెగ్యులర్ ఏఓను నియమించాలని రైతులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



వాజేడు : కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బొమ్మనపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై కొప్పుల తిరుపతిరావు కథనం ప్రకారం.. బొమ్మనపల్లికి చెందిన సోడి మోహన్‌రావు (37) కుటుంబ సమస్యలతో సతమతమౌతున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంకటాపురం (కె)లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి వైద్యం చేయించారు. పరిస్థితి విషమిస్తుండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు చిరజీవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పోలీసుల తనిఖీ



వెంకటాపురం (కె) : మండలంలోని చొక్కాల గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలానికి భద్రాచలం, చర్ల మండలాల నుంచి వస్తున్న, వెళ్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితుల పూర్తి వివరాలు సేకరించి విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహన చోదకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆర్థిక సాయం కోసం వెంటకమ్మ కుటుంబ సభ్యులు పెద్దపల్లి జెడ్పీచైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధును కోరారు. దీంతో పుట్ట మధు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈమేరకు మధు వ్యక్తిగత సహాయకుడి ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో వెంకటమ్మకు మంగళవారం ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

మహదేవపూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి పాత కక్షలతో కత్తితో దాడి చేసిన సంఘటనలో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆకుల రామదాసు, బెగుళూర్ గ్రామానికి చెందిన ఆకుల మొండయ్యకు మధ్య కొంత కాలంగా గొడవలున్నాయి. ఈ క్రమంలో రామదాసుపై మొండయ్య కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. రామదాసు సోదరుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు మొండయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

● ములుగు ఎమ్మెల్యే సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

వెంకటాపురం (ఎం) : భవిష్యత్‌లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ములుగు ఎమ్మెల్యే సీతక్క తెలిపారు. కేంద్రంలోని బీజేపీ దేశంలోని ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర నేపథ్యంలో ప్రధాని మోడీ ఓర్వలేకపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దళితులకు భూపంపిణీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పోడు భూములకు పట్టాలిస్తామన్న సీఎం హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, పోడు భూములకు పట్టాలు, దళితులకు భూపంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మాల్లాడి రాంరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షులు చెన్నోజు సూర్యనారాయణ, చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఆకుతోట చంద్రమౌళి, ఎన్ఎస్‌యూఐ, జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, సర్పంచ్‌లు మాడ ప్రకాశ్, చేద సారంగం, సుమన్, అహ్మద్ పాషా, రాంబాబు, ఎంపీటీసీ జంగిలి శ్రీలత, భాస్కర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వీరేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ఏటూరునాగారం : జీవితంలో విద్యార్థి దశ కీలకమని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా విద్యార్థిని సంజన, ఏటీడీఓగా స్పందన, హెచ్‌డబ్ల్యూఓగా శ్రావణి, టీచర్లుగా ఇతర విద్యార్థినులు వ్యవహరించి అలరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేవతి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదవాలని సూచించారు. తద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొనడం పట్ల విద్యార్థినులను అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా ముళ్లకట్ట ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, శంకర్‌నాయక్, నిర్మల, తులసి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, స్రవంతి, చెంచయ్య, అరుణ, సమ్మయ్య, సాంబయ్య, చంద్రకళ, సుశీల, సరస్వతి, శ్యామలత, అర్చన, ప్రభ, రామ్మూర్తి, ట్రెయినీ టీచర్లు స్వామి, రేణుక, నిరోశ, సృజన, మధు తదితరులు పాల్గొన్నారు.

కంచె ఉన్నా కోతుల బెడద



ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ హైస్కూల్ ప్రహరీకి కంచె ఏర్పాటు చేసినా కోతుల బెడద తప్పడం లేదు. విద్యార్థులను కోతులు బెంబేలెత్తిస్తున్న క్రమంలో అధికారులు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో ప్రహరీపై ఇనుప కంచె ఏర్పాటు చేశారు. అయినా కోతులు కంచె ఉన్నా స్కూల్ ఆవరణలోకి వస్తూ మధ్యాహ్న భోజన సమయంలోనూ విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కంచె ఏర్పాటు చేసినా కోతుల బెడద తప్పడం లేదంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గొత్తికోయ విద్యార్థులకు అండగా ట్రస్ట్



నోట్ బుక్కులు అందిస్తున్న మధు రాజ్‌కుమార్

ఏటూరునాగారం : గొత్తికోయ విద్యార్థులకు దుగ్గి శాంతయ్య మెమోరియల్ ట్రస్ట్ అండగా ఉంటుందని చైర్మన్ దుగ్గి మధురాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొండాయి గ్రామంలోని గోవిందరాజుల కాలనీకి చెందిన గొత్తికోయ చిన్నారులకు ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన మంగళవారం ఉచితంగా నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు రావాలంటే 2 కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్రమంలో విద్యార్థుల కోసం అక్కడే తాత్కాలిక షెడ్ ఏర్పాటు చేసి స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. విద్యావాలంటీర్‌ను సైతం ఏర్పాటు చేసి వేతనం అందిస్తామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొండాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రవి బాలాజీ, సీఆర్పీ శ్రీధర్ నాయక్, విద్యావాలంటీర్ విజయ్ పాల్గొన్నారు.

అన్నదానం



కన్నాయిగూడెం : మండలంలోని అయ్యప్ప స్వామి దీక్షాదారులకు మండలంలోని గుర్రేవుల గ్రామంలోని శ్రీ సీతారాముల ఆలయం వద్ద బీజేపీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏటూరునాగారం మాజీ ఎంపీపీ జాడి రామరాజు మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్, ఉపాధ్యక్షుడు జనగం దుర్గారావు, ఏటూరునాగారం మండల ఉపాధ్యక్షుడు కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’పై అవగాహన



వాజేడు : మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్



మంగపేట : శిక్షణ ఇస్తున్న హరీశ్

వాజేడు : మండలంలోని మొరుమూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలకు వైద్యాధికారి కొమరం మహేందర్ మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు, చికిత్స అందించే లక్ష్యంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

మంగపేట : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి కంటి వెలుగు కార్యక్రమంపై డాటా ఎంట్రీ ఆపరేటర్ హరీష్ మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు కంటి పరీక్షలు ఉచితంగా అందించేందుకు ప్రవేశపెట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం ఈ నెల 18 నుంచి ప్రారంభం కానుందన్నారు. కంటి పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సి చర్యలు, పాటించాల్సిన నిబంధనలపై ఆయన సిబ్బందికి శిక్షణ ఇచ్చి పలు రకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో షెడ్యూల్ ప్రకారంగా కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు స్వర్ణలత, స్టాఫ్‌నర్సు మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ రాంబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం అరుణ, సోమలక్ష్మి, సీతారావమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రత.. జాగ్రత్త



వాజేడు : చలి తీవ్రత నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కొమరం మహేందర్ తెలిపారు. మండలంలోని పెనుగోలు కాలనీలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులను, బాలింతలను, గర్భిణులను పరిక్షించి మందులు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చిట్యాల: చిట్యాల తహసీల్దార్‌గా నూతనంగా వచ్చిన సమ్మయ్యను తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు మంగళవారం సన్మానించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దొడ్డి కిష్టయ్య, మండల అధ్యక్షుడు నేరెళ్ల ఓదేలు, మండల ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య పాల్గొన్నారు.

చిట్యాల వాసికి డాక్టరేట్

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ఆరెపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్ లభించింది. సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన ఆసియా వేదిక్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ప్రతినిధులు గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. ఈ అవార్డును తమిళనాడులోని హోసూరులో ఫిబ్రవరి 28న డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు యూనివర్సిటీ కో ఆర్డినేటర్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఫౌండర్, చైర్మన్ లయన్ డాక్టర్ అకుల రమేశ్ తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు



స్కాలర్‌షిప్ చెక్కు అందుకుంటున్న ప్రిన్సిపాల్

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న పేద ప్రతిభావంతులైన విద్యార్థినులకు మలబార్ గోల్డ్ సంస్థ రూ.1.54 లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ భగవద్గీత తెలిపారు. మండల కేంద్రంలోని కళాశాలలో ప్రిన్సిపాల్ భగవద్గీత వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని పింగిళి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కాలేజీకి చెందిన 19 మందికి బాలికలకు సంబంధించి రూ.8 వేలు చొప్పున చెక్కును ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆర్ఐఓ మాధవరావు తనకు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా శ్రమించాలని సూచించారు.

‘కోడిగుడ్లు వడ్డించడం సాధ్యం కాదు’



మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న రవీందర్

ఏటూరునాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లను వడ్డించడం సాధ్యం కాదని ఏఐటీయూసీ, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో వంట కార్మికులకు సీఎం కేసీఆర్ గౌరవ వేతనం పెంచుతున్నట్లు ప్రకటించినా నేటికీ అమలు కావటం లేదన్నారు. దీంతో పాటు కోడిగుడ్లకు ప్రభుత్వం రూ.5లు ఇస్తే మార్కెట్లో రూ. 7లు ఉందన్నారు. అందువల్ల గుడ్డుకు రూ.2లు అదనంగా చెల్లించి కార్మికులు విద్యార్థులకు పెట్టలేకపోతున్నారన్నారు. దానితో పాటు ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మెస్ చార్జీలు ప్రస్తుతం మార్కెట్ ధరలకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉందన్నారు. మెస్ చార్జీలు ప్రతి విద్యార్థికి రూ.25లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించాలని కార్మికులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి ప్రమీల, కృష్ణ, మామిడి పార్వతి, వావిలాల జయమ్మ, సాలమ్మ, చిటమట లక్ష్మి, దానం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

‘గండ్రను విమర్శించే అర్హత లేదు’

మొగుళ్లపల్లి : ప్రజల కోసం పరితపిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణను విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించిన దీక్ష విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. దీంతో పార్టీ మీటింగులు పెట్టి గండ్ర సత్యనారాయణపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గండ్ర సత్యనారాయణను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రావు, మహ్మద్ రఫీ, యూత్ ప్రెసిడెంట్ నీల రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



మంగపేట : కత్తిగూడెంలో..



వాజేడు : అరుణాచలపురంలో...

మంగపేట : భూసంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కత్తిగూడెం, వాడగూడెంలో మంగళవారం నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. కత్తిగూడెంలో 20, రమణక్కపేటలో 3 దరఖాస్తులు అందినట్టు తెలిపారు. ఈనెల 11 (బుధవారం) కత్తిగూడెం, అకినేపల్లి మల్లారం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. దరఖాస్తులపై విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ కుమారస్వామి, వీఆర్ఏ కర్రి నాగార్జున, పాగ బాబు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలపురంలో..

వాజేడు : మండలంలోని అరుణాచలపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల భూమికి సంబంధించిన సమస్యలను తెలుసుకున్నారు. మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. ధరణి పోర్టల్‌లోని టీఎమ్ 33 మాడ్యుల్స్ గురించి తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ కాట రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

మంగపేట : మండలంలోని వాడగూడెం ఇసుక క్వారీ నుంచి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశానికి సోమయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాడగూడెంలో ఆదివాసీ గిరిజన సొసైటీ పేరుతో ఏర్పాటైన ఇసుక క్వారీలో గిరిజన, ఇతర పెత్తందార్లు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డీడీలు తీయకుండానే అధిక లోడుతో ఇసుక తరలిస్తున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఒకే వే బిల్లుపై రెండు చొప్పున ట్రిప్పులు తరలిస్తున్నారని, రాత్రివేళల్లో లారీల్లో జీరో దందాకు పాల్పడుతున్నారని వివరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతోపాటు ప్రమాదాలకు కారణమౌతున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇసుక అక్రమ తరలింపుపై విచారణ చేయించి బాధ్యులతోపాటు అక్రమార్కులకు సహకరిస్తున్న టీఎస్ఎండీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు యానయ్య, భగవాన్‌రెడ్డి, నర్సింహారావు, హిదాయతుల్లా, ఎట్టి సారయ్య, నర్రకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న రాజు

వెంకటాపురం (ఎం) : మండలంలోని రామాంజపూర్ సమీపంలోని ఎరుకల నాంచారమ్మ (పంచకూటాలయం) ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఆలయాన్ని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేతిరి భిక్షపతి, పల్లకొండ భాస్కర్‌లతో కలిసి రాజు మంగళవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ రాజు మాట్లాడారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఎరుకల నాంచారమ్మ ఆలయం ధ్వంసమైన క్రమంలో పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం కేసీఆర్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తూ ఆలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. గిరిజన శాఖ మంత్రి ఎరుకల నాంచారమ్మ ఆలయం పట్ల వివక్ష పాటిస్తున్నారని తెలిపారు. ఎరుకల నాంచారమ్మ జాతరకు నిధులు కేటాయించాలని పలుసార్లు కోరినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎరుకల, ఇతర కులాల ప్రజలు తరలివచ్చి నాంచారమ్మకు మొక్కులు చెల్లిస్తారని వివరించారు. జాతర సందర్భంగా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల విఫలమయ్యారని చెప్పారు. జాతరకు వెళ్లేలా రోడ్డు వేయాలని, తాగునీటి వసతి కల్పించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జాతర నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు కేతిరి రాజు, సారం రాజు, పాలకుర్తి శ్రీనివాస్, కేతిరి క్రాంతి, కేతిరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైస్ చైర్‌పర్సన్ పరామర్శ



ఎస్ఎస్ తాడ్వాయి : పరామర్శిస్తున్న నాగజ్యోతి



ఏటూరునాగారంలో..

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, స్థానిక సర్పంచ్ జాజ చంద్రం సమీప బంధువు దాయ ముత్తయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా చంద్రంను స్థానిక నాయకులతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మంగళవారం పరామర్శించారు. తొలుత ముత్తయ్య మృతదేహానికి నాగజ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, మేడారం జాతర కమిటీ మాజీ చైర్మన్ రేగ నర్సయ్య, కాటాపూర్ సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, మాజీ మండల అధ్యక్షుడు నూశెట్టి రమేశ్, నాయకులు రఫీక్, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం : బీఆర్ఎస్ నాయకుడు కాకులమర్రి చిట్టిబాబును అతడి తల్లి ప్రమీలదేవి ఇటీవల మృతి చెందిన సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. గోవింద్‌నాయక్ వెంట ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, ఎంపీటీసీ కుమ్మరి స్వప్న చంద్రబాబు, నాయకులు ముడుతపల్లి మోహన్, కూనూరు మహేశ్, నూతి కృష్ణ, ఆరీఫ్, సప్పిడి రాంనర్సయ్య, రాంబాబు, రమేశ్, రామకృష్ణ, సర్దార్ పాషా, చిప్ప అశోక్, కందకట్ల శ్రీనివాస్, దేపాక శ్రీరాములు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం

కాటారం: సంకటహర చతుర్థిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ ఆనందధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో వేద మంత్రోచ్చారణల మధ్య మంగళవారం సామూహిక గణపతి హోమాలు వైభవంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అయ్యప్ప స్వామికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఆలయంలో అయ్యప్ప స్వామి మాలాధారణ భక్తులకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు శబరియాత్రకు ప్రయాణమయ్యారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్త, ఆలయ పురోహితులు గుండూరి భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.